
ఆంధ్రజ్యోతి

గరిష్ఠం 30.5
కనిష్ఠం 23.4

ANDHRAJYOTHY



సూర్యాపేట

5


గురువారం 12 సెప్టెంబరు 2024

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.5050)	589.10 (310.3558)	68,210	43,230
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	643.50 (3.96)	2,724	నిల్
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	172.27 (41.63)	13,643	16,000

చికెన్ ధరలు: లైవ్ : రూ.110 | డ్రెస్ : రూ.160 | స్కిన్‌లెస్ : రూ.190

కొత్త ఏడాదిలో యాదాద్రి వెలుగులు



రాష్ట్రానికి విద్యుత్ వెలుగులు అందించేందుకు యాదాద్రి థర్మల్ పవర్‌స్టేషన్ వేగంగా సిద్ధమవుతోంది. ఒక్కో ఘట్టాన్ని విజయవంతంగా పూర్తిచేస్తున్న అధికారులు ప్లాంట్ నుంచి విద్యుదుత్పాదన చేపట్టేందుకు అవసరమైన కార్యాచరణ చేస్తున్నారు. బుధవారం కీలకమైన రెండో యూనిట్ సింక్రనైజేషన్ ప్రక్రియను ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి ప్రారంభించారు. నల్లగొండ జిల్లాలోని దామరచర్ల మండలం వీర్లపాలెం వద్ద నిర్మిస్తున్న ఈ విద్యుత్ కేంద్రం నుంచి తొలిదశలో ఈ ఏడాది డిసెంబరు నాటికి మూడు యూనిట్ల ద్వారా 2,400 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేయనున్నారు. వచ్చే ఏడాది మార్చి 31 నాటికి మిగిలిన రెండు యూనిట్లు కలిపి మొత్తం 4వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేసేందుకు పనులు కొనసాగుతున్నాయి.

● ఆంధ్రజ్యోతిప్రతినిధి, నల్లగొండ

- డిసెంబరు నెలాఖరుకు 2,400 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి
- నిర్వాసితులకు ఉద్యోగాలిస్తామని ఉపముఖ్యమంత్రి హామీ
- పర్యావరణ అనుమతులొచ్చాక వేగవంతమైన పనులు
- ప్లాంట్ పనులతో సమాంతరంగా రైల్వేలైన్ నిర్మాణం
- వచ్చే ఏడాది మార్చి నాటికి ప్లాంట్ మొత్తం సిద్ధం

యాదాద్రి థర్మల్ పవర్‌ప్లాంట్‌లో తొలుత 50శాతం విదేశీ బొగ్గు, మరో 50శాతం స్వదేశీ బొగ్గును వినియోగిస్తామని ప్రభుత్వం ప్రకటించగా, అనంతర కాలంలో మొత్తం స్వదేశీ బొగ్గుతో నిర్వహిస్తామని వెల్లడించింది. దీంతో ఈ ప్లాంట్ నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ పర్యావరణవేత్తలు జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్‌లో కేసువేశారు. ఈ కేసుతో పర్యావరణ అనుమతులను కేంద్ర పర్యావరణ సంస్థ నిలిపివేసి, మళ్లీ ప్రజాభిప్రాయసేకరణ చేపట్టాలని ఆదేశించింది. దీంతో ఈ ఏడాది ఫిబ్రవరి 20న ప్రజాభిప్రాయసేకరణ చేపట్టి నివేదించడంతో ఈ కేసును గ్రీన్‌ట్రిబ్యునల్ కొట్టివేసింది. ఫలితంగా కేంద్ర పర్యావరణ సంస్థ ఈ ఏడాది జూలై 5న అనుమతులు మంజూరు చేసింది. అప్పటి నుంచి ప్లాంట్ పనులు ఊపందుకున్నాయి. రాష్ట్ర ఇంధనశాఖ బాధ్యతలు నిర్వహిస్తున్న ఉపముఖ్యమంత్రి ప్రతీ వారం అధికారులు, ఇంజనీర్లతో సమీక్ష నిర్వహిస్తూ పనుల పురోగతికి లక్ష్యం విధించారు. దీంతో పనుల్లో వేగం పెరిగింది. మొత్తం ఐదు యూనిట్లకు మొదటి రెండు యూనిట్లలో ఇప్పటికే లైటప్ ప్రక్రియ విజయవంతంగా పూర్తయింది. తాజాగా, బుధవారం రెండో యూనిట్‌లో సింక్రనైజేషన్ ప్రక్రియ ప్రారంభమైంది. ఈనెల 30న మొదటి యూనిట్‌లోనూ సింక్రనైజేషన్ ప్రారంభించేందుకు అధికారులు రంగం సిద్ధం చేశారు. రెండో యూనిట్‌లో కీలకమైన బొగ్గు మండించే ప్రక్రియను చేపట్టడం ద్వారా ఈ యూనిట్‌లో 800 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి బాయిలర్‌ని సిద్ధం చేసే ప్రక్రియను అక్టోబరు 5న, అక్టోబరు 15న మొత్తం రెండో యూనిట్ ట్రయల్ ఆపరేషన్ చేపట్టనున్నట్లు అధికారులు వెల్లడించారు. అదేవిధంగా మొదటి యూనిట్‌లో ఈనెల 30న సింక్రనైజేషన్ చేసి, అక్టోబరు 25న బొగ్గు మండించే ప్రక్రియ, 800 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి బాయిలర్‌ను సిద్ధం చేసే ప్రక్రియను చేపట్టి, అక్టోబరు 30న మొత్తం మొదటి యూనిట్ ట్రయల్ రన్ నిర్వహించనున్నారు.

● నాలుగో యూనిట్‌లో ఈ నెల 25న బాయిలర్ లైటప్ ప్రక్రియ, నవంబరులో స్టీమ్ బ్లోయింగ్, డిసెంబరు 15న సింక్రనైజేషన్ ప్రక్రియ చేపట్టనున్నారు. ఈ ఏడాది డిసెంబరులో బొగ్గును మండించి విద్యుత్ ఉత్పత్తి ప్రక్రియ, డిసెంబరు నెలాఖరుకు పూర్తిస్థాయి ట్రయల్‌రన్ నిర్వహించనున్నారు.

● మూడో యూనిట్ బాయిలర్ లైటప్ ప్రక్రియ అక్టోబరు 10న, స్టీమ్ బ్లోయింగ్ ప్రక్రియ డిసెంబరులో, వచ్చే ఏడాది ఫిబ్రవరిలో సింక్రనైజేషన్, బొగ్గు మండించి విద్యుత్ ఉత్పత్తి ప్రక్రియ, అదే ఏడాది ఫిబ్రవరి నెలాఖరుకు ట్రయల్ ఆపరేషన్ పూర్తిచేస్తారు.

● ఐదో యూనిట్‌లో ఈ ఏడాది డిసెంబరు 15న బాయిలర్ లైటప్ చేపట్టనున్నారు. వచ్చే ఏడాది జనవరిలో స్టీమ్‌బ్లోయింగ్ ప్రక్రియ, ఫిబ్రవరిలో సింక్రనైజేషన్ ప్రక్రియను నిర్వహిస్తారు. మార్చిలో బొగ్గు మండించి విద్యుత్ ఉత్పత్తి నిర్వహించడంతో పాటు, అదే నెలలో ట్రయల్‌రన్ చేపట్టి మొత్తం ప్లాంట్‌లో అన్ని యూనిట్లను విద్యుత్ ఉత్పత్తికి సిద్ధం చేయనున్నారు.

నిర్వాసితులకు ఉద్యోగాలివ్వాలని డిప్యూటీ సీఎం ఆదేశం

రాష్ట్ర ప్రగతి కోసం తరతరాలుగా తమ కుటుంబాలకు ఆదరువైన భూములు ఇచ్చిన త్యాగధనులను ప్రభుత్వం గుర్తిస్తుందని, వారి కుటుంబాలకు అర్హతల మేరకు ఇదే ప్లాంటులో ఉద్యోగాలిచ్చేందుకు కార్యాచరణ చేపట్టాలని జెన్‌కో సీఎండీ రోనాల్డ్‌రోస్, ఇతర ఉన్నతాధికారులకు ఇక్కడి నుంచే ఆదేశాలిస్తున్నట్లు బుధవారం థర్మల్ ప్లాంట్‌లో సింక్రనైజేషన్ ప్రక్రియను ప్రారంభించిన అనంతరం ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క ప్రకటించారు. నిర్వాసితులకు ఉద్యోగాలిచ్చే అంశంపై ఆయన ఆదేశాలివ్వడంపై మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హర్షం వ్యక్తం చేయడంతో పాటు, అధికారులు ఈ ప్రక్రియను వేగంగా పూర్తిచేయాలని ఆదేశించారు. రాజకీయాలకు అతీతంగా భూనిర్వాసితులందరికీ ఉద్యోగాలొస్తాయని, ఎవ్వరూ ఆందోళన చెందాల్సిన పనిలేదని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి స్పష్టం చేశారు. మంత్రుల ఆదేశాలతో నిర్వాసితులకు ఊరట కలిగింది. ప్లాంట్ కోసం 4,676 ఎకరాల భూమిని సేకరించగా, సుమారు 1,560 కుటుంబాలకు చెందిన వారికి ఇంటికో ఉద్యోగం ఇవ్వాలని నిర్వాసితులు కోరుతున్నారు. ప్లాంట్ ప్రారంభోత్సవానికి ముందే జాబ్‌కార్డులు ఇచ్చి, ఆయా ఉద్యోగాలకు శిక్షణ కూడా ఇవ్వాలని జెన్‌కో అధికారులను డిప్యూటీ సీఎం, మంత్రులు ఆదేశించారు. పెండింగ్ పరిహారం, ఇళ్లు కోల్పోయిన కపూర్‌తండా, మోదుగులకుంటతండాలకు చెందిన గిరిజన కుటుంబాలకు ఏర్పాటు చేసిన ఆర్‌అండ్‌ఆర్ సెంటర్‌లో మౌలిక వసతుల కల్పనపై కూడా దృష్టి సారించి పనులు పూర్తి చేయాలని అధికారులను వారు ఆదేశించారు.


యాదాద్రి థర్మల్ ప్లాంట్‌లో సింక్రనైజేషన్‌ను ప్రారంభిస్తున్న భట్టి

వచ్చే నెలాఖరుకు రైల్వేలైన్ పనులు పూర్తి

యాదాద్రి థర్మల్‌పవర్‌ప్లాంట్‌లో కీలకమైన రైల్వే ట్రాక్ నిర్మాణపనులు కూడా ప్లాంట్ నిర్మాణ పనులకు సమాంతరంగా వేగంగా కొనసాగుతున్నాయి. ఈ ప్లాంట్‌కు ఏడాదికి 12.29మిలియన్ యూనిట్ల బొగ్గు అవసరమవుతుందని అంచనా. రైల్వేలైన్ అందుబాటులోకి వస్తే తక్కువ రవాణా వ్యయంతో బొగ్గును అందుబాటులోకి తెచ్చుకునే వెసులుబాటు ఉంటుందనే అంచనాతో ఈ పనుల్లో వేగం పెంచారు. సగటున నెలకు ఒక మిలియన్ యూనిట్ల బొగ్గు ఇక్కడ అవసరం. ఈ బొగ్గును పూర్తిస్థాయిలో సింగరేణి గనుల నుంచే తీసుకోవాలని తాజాగా నిర్ణయించారు. బొగ్గును రవాణా చేసే నిమిత్తం ప్లాంట్ వద్దకు విష్ణుపురం నుంచి ప్రత్యేకంగా రైల్వేలైన్ ఏర్పాటుచేస్తున్నారు. ఈ పనులు ప్రస్తుతం చివరిదశకు చేరాయి. నాలుగు బ్రిడ్జిలున్న చోట్ల మినహా మిగిలిన ట్రాక్ పనులు మొత్తం పూర్తయ్యాయి. ప్లాంట్ వద్ద ఎక్స్‌చేంజ్‌యార్డు పనులు ప్రస్తుతం కొనసాగుతుండగా, బ్రిడ్జిల వద్ద ట్రాక్ పనులు నిర్మాణ దశలో ఉన్నాయి. వీటితో పాటు జాన్‌పహాడ్ నుంచి విష్ణుపురం వరకు రైల్వేట్రాక్ పనులు పూర్తవగా, జాన్‌పహాడ్ స్టేషన్ పనులు పూర్తయ్యాయి. రైల్వేశాఖ ఈ మార్గంలో నిర్వహించాల్సిన సైట్ యాక్సెప్టెన్సీ టెస్ట్‌కు రంగం సిద్ధం చేశారు. ఈ ప్లాంట్‌కు ప్రత్యేకంగా రెండు లోకోమోటివ్‌లను ఇప్పటికే సైట్ వద్దకు చేర్చారు. ఈ నెలాఖరులోగా రైల్వేశాఖ నుంచి ట్రాక్ సర్టిఫికెట్, క్లియరెన్స్ వస్తుందని అధికారులు భావిస్తున్నారు. అక్టోబరు 1నుంచి సింగరేణి గనుల నుంచి బొగ్గు తరలించేందుకు అవసరమైన అనుమతులు మంజూరయ్యాయి. మొత్తంగా రైల్వేట్రాక్ పనులు పూర్తిచేయడంతో పాటు ఇక్కడికి బొగ్గు తరలించేందుకు ప్లాంట్ వద్ద అవసరమైన పనులన్నీ పూర్తవుతున్నాయి. ఈ ఏడాది డిసెంబరుకు ముందే అంటే నవంబరు మొదటి వారానికే ప్లాంట్‌ను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తెస్తామని జెన్‌కో అధికారులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

కేంద్ర బృందం పర్యటనతో న్యాయం జరిగేనా ?

● వరద ప్రాంతాలను పరిశీలించేందుకు నేడు బృందం సభ్యులు రాక

హుజూర్‌నగర్, సెప్టెంబరు 11: కేంద్ర పరిశీలన బృందంతో తమకు న్యాయం జరుగుతుందని రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారు. జిల్లాలో ఇటీవలి వరదలతో రైతులు నష్టపోయారు. ఈ నేపథ్యంలో వరద ప్రాంతాలను పరిశీలించేందుకు కేంద్రబృందం బుధవారం రావాల్సి ఉండగా గురువారానికి వాయిదాపడింది. ఈ బృందం జిల్లాలోని హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గాల్లో పంట, ఆస్తి నష్టాన్ని అంచనావేయనుంది. ఈ బృందం ఖమ్మం జిల్లా పర్యటనకు వెళ్లడంతో జిల్లా పర్యటన ఒకరోజు వాయిదాపడినట్లు వ్యవసాయశాఖ ఉన్నతాధికారులు తెలిపారు.

ప్రయాణ సమయంలో జాగ్రత్తలు పాటించాలి

● ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్


జాతీయ రహదారి 65పై టేకుమట్ల వద్ద జంక్షన్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్

సూర్యాపేటరూరల్, సెప్టెంబరు 11: వాహనదారులు ప్రయాణ సమయంలో జాగ్రత్తలు పాటించాలని ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ అన్నారు. బుధవారం జాతీయ రహదారి 65పై టేకుమట్ల వద్ద ఖమ్మం హైవే జంక్షన్, రాయినిగూడెం ఖమ్మం యూటర్న్ జంక్షన్‌ను ఏఆర్ అదనపు ఎస్పీ జనార్దన్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. జాతీయ రహదారిపై ఉన్న బ్లాక్‌స్పాట్ వద్ద రోడ్డు స్థితిగతులు, లోపాలను పరిశీలించి తగిచన సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తరచూ జరుగుతున్న ప్రమాదాలకు కారణాలపై చర్చించి నివారణకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రాణం చాలా విలువైనదని, రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు పోకుండా చూడాలన్నారు. వాహనదారులు రాంగ్‌రూట్‌లో వాహనాలు నడపరాదన్నారు. జాతీయ రహదారుల సంస్థ, కాంట్రాక్ట్ సంస్థ ప్రతినిధులు రహదారి లోపాల సవరణపై దృష్టి పెట్టాలన్నారు. ఆయన వెంట డీఎస్పీ రవి, సీఐ సురేందర్‌రెడ్డి, ఎస్ఐ బాలునాయక్, తదితరులు ఉన్నారు.

'గురుకుల పాఠశాల భవనం నిర్మించాలి'

అర్వపల్లి, సెప్టెంబరు 11: జాజిరెడ్డిగూడెం మండలం కాసర్లపాడు గ్రామంలో సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల, కళాశాలకు భవనం నిర్మించాలని ప్రగతిశీల తల్లిదండ్రుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మచ్చ నర్సయ్య అన్నారు. ఈ మేరకు ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నగరిగారి ప్రీతమ్‌ను బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం నర్సయ్య మాట్లాడుతూ, పదేళ్ల క్రితం ఎనిమిదెకరాల ప్రభుత్వ భూమిని కేటాయించిన స్థలంలో ఇంటిగ్రేటెడ్ పాఠశాల, కళాశాలకు భవనాలు నిర్మించాలని కోరారు. ప్రస్తుతం పాఠశాల, కళాశాల అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయని తెలిపారు.



కోదాడకు స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్

జీవో నెం.731 ద్వారా రూ.10కోట్లు మంజూరు

ఫలించిన మంత్రి ఉత్తమ్, ఎమ్మెల్యే పద్మావతి కృషి

వీలైనంత వేగంగా అందుబాటులోకి తెస్తాం : మంత్రి



నల్లగొండ, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): సూర్యాపేట జిల్లా కోదాడలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటుకు ప్రభుత్వం జీవో నెం.731 విడుదల చేసింది. ఈ సెంటర్ నిర్మాణానికి నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్స్ రూ.10కోట్ల నిధులను మంజూరు చేసింది. రాష్ట్ర ఆర్‌అండ్‌బీ శాఖ ఈ కేంద్రాన్ని కోదాడలో ఏర్పాటు చేయనుంది. పారిశ్రామిక, ఆటో మొబైల్ రంగానికి కేంద్రమైన కోదాడలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేయించాలనే లక్ష్యంతో నీటిపారుదల శాఖమంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి చేసిన ప్రయత్నాలు ఫలించి కోదాడకు ఈ సెంటర్ దక్కింది. ఈ కేంద్రం ఏర్పాటయితే ఇక్కడి నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడడంతోపాటు చేస్తున్న ఉద్యోగాల్లో ప్రమోషన్లకు అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. నైపుణ్య సాధనతో జాబ్ గ్యారంటీతో నిరుద్యోగ యువత కుటుంబాలకు ఊరట కలగడంతో పాటు, అదే సమయంలో సామాజిక వృద్ధికి దోహదపడుతుంది. శాస్త్ర, సాంకేతికంగా వస్తున్న మార్పులను యువత అందిపుచ్చుకునేందుకు ఈ సెంటర్లు దోహదపడతాయన్న ఆలోచనతో ప్రభుత్వం ఈ కేంద్రాలను ఏర్పాటు చేస్తోంది. ఈ కేంద్రాల్లో నైపుణ్య శిక్షణ పొందడం ద్వారా అకడమిక్ క్వాలిఫికేషన్ ఉన్న యువతకు మరింత మెరుగైన వేతనాలతో ఉద్యోగాలు దక్కుతాయి. అకడమిక్ విద్యలేకపోయినా, 10వ తరగతి నుంచి డిగ్రీ వరకు డ్రాపవుట్ విద్యార్థులకు సైతం వారికి తగిన వృత్తుల్లో ఇక్కడ శిక్షణ లభిస్తుంది. తద్వారా వారి జీవనోపాధికి మెరుగైన అవకాశాలు దక్కుతాయి. 1998లో స్థాపించబడిన ఎన్ఏసీ (నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్స్) ఇప్పటివరకు దేశంలో దాదాపు 5లక్షల మంది నిరుద్యోగులకు నైపుణ్య శిక్షణను అందించిందని, అందరికీ తగిన ఉపాధి అవకాశాలు దక్కాయని సంస్థ రికార్డుల్లో పేర్కొంది. అలాంటి సంస్థ కోదాడలో రూ.10కోట్లతో స్కిల్‌డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటుకు ముందుకు రావడం ఇక్కడి నిరుద్యోగ యువతకు ఒక చక్కటి అవకాశమని, వీలైనంత వేగంగా ఇక్కడ ఈ సెంటర్ అందుబాటులోకి తీసుకొచ్చేందుకు తమవంతు కృషి చేస్తామని మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి పేర్కొన్నారు.

బేతవోలు పీఏసీఎస్ సీఈవో, క్యాషియర్ తొలగింపు


బేతవోలు సొసైటీలో మాట్లాడుతున్న చైర్మన్ రవీందర్‌రెడ్డి

చిలుకూరు, సెప్టెంబరు 11: మండలంలోని బేతవోలు ప్రాథమిక సహకార సంఘంలో రైతులకు వ్యవసాయ రుణాల మంజూరులో జరిగిన అవకతవకలపై పీఏసీఎస్ సీఈవో, క్యాషియర్‌ను తొలగిస్తూ పాలకవర్గం తీర్మానం చేసింది. సహకార సంఘంలో అవకతవకలపై కోదాడ కోఆపరేటివ్ బ్యాంక్ అధికారులు మంగళవారం ప్రాథమిక విచారణ నిర్వహించారు. 2021లో రైతుల రుణాల మంజూరు రికార్డులను వారు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జెర్రిపోతులగూడెం గ్రామానికి చెందిన షేక్ మహ్మద్ షరీఫ్, షేక్ బాషామియా, షేక్ రుక్కుద్దీన్‌తో పాటు పోలేనిగూడెం గ్రామానికి చెందిన తోనం నరేష్ తదితర రైతుల పేర్లతో అధికారులు రుణాలు స్వాహా చేసినట్టు తేలిచింది. అయితే పూర్తిస్థాయి విచారణ కోసం రికార్డులు పరిశీలించాల్సి ఉందని అధికారులు తెలిపారు. అయితే దీనికి బాధ్యులైన సదరు ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలని జిల్లా సహకార బ్యాంకు చైర్మన్, అధికారులు బేతవోలు సహకార సంఘ చైర్మన్‌ను ఆదేశించారు. దీంతో పాలకవర్గ అత్యవసర సమావేశం నిర్వహించి, అవినీతికి పాల్పడిన సీఈవో పాషా, 2021లో క్యాషియర్‌గా పనిచేసిన వాజిద్ అలీని విధుల నుంచి తొలగిస్తూ తీర్మానం చేశారు. సంఘ కార్యకలాపాల నిర్వహణ కోసం ఇన్‌చార్జిగా సీఈవోగా బత్తిన కన్నయ్య, క్యాషియర్‌గా నజీర్‌ను నియమించారు. అవినీతికి పాల్పడిన ఉద్యోగులపై చట్టపరంగా చర్యలు తీసుకుని, డబ్బు రికవరీ చేస్తామని సంఘం చైర్మన్ బజ్జూరి రవీందర్‌రెడ్డి తెలిపారు. సమావేశంలో డైరెక్టర్లు తాళ్లూరి ప్రసాద్, బజ్జూరి సత్యనారాయణరెడ్డి, మద్ది సుదర్శన్‌రెడ్డి, అనంతు ప్రమీల, సోక్లా, మరియమ్మ, దొంగరి గోపాల సత్యనారాయణ పాల్గొన్నారు.

స్థానిక లారీలను విస్మరించడం సరికాదు


గోదాం ఎదుట నిరసన తెలుపుతున్న లారీ ఓనర్లు

సూర్యాపేటఅర్బన్, సెప్టెంబరు 11: స్థానిక లారీలను విస్మరించి, ఇతర రాష్ట్రాల లారీలకు లోడ్‌లు ఇవ్వడం సరికాదని దిసూర్యాపేట లారీ ఓనర్స్ అసోసియేషన్ కార్యదర్శి గుండు సురేష్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని శాంతినగర్ వద్ద ఉన్న ఎఫ్‌సీఐ గోదాం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పత్తి బేళ్ల రవాణాకు సంబంధించి ఆదిలాబాద్ జిల్లాకు చెందిన పల్లవి ట్రాన్స్‌పోర్ట్ టెండర్‌ను దక్కించుకొని స్థానిక లారీలతో ఈ ఏడాది జూన్ 19న కిరాయి నిర్ణయించిందన్నారు. పత్తి బేళ్లతో గుజరాత్ రాష్ట్రానికి వెళ్తే కిలోమీటర్‌కు రూ.70, తమిళనాడుకు రూ.80, మిగతా ప్రాంతాలకు రూ.100 చొప్పున ధర నిర్ణయించిందన్నారు. సీసీఐ మేనేజర్ మారడంతో నాలుగు నెలలుగా స్థానిక లారీలను కాదని ఇతర రాష్ట్రాలకు చెందిన లారీలకు లోడ్లు ఇస్తూ తమకు అన్యాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో పిన్ని శ్రీనివాసనాయుడు, గుండు నర్సింహ, రాచకొండ రాములు, ఏల్పూరి రాంబాబు, బషీర్, వేర్పుల రమేష్, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణకు వ్యతిరేకంగా పోరాటం

సూర్యాపేటఅర్బన్, సెప్టెంబరు 11: ఎస్సీ, ఎస్టీ వర్గీకరణకు వ్యతిరేకంగా పోరాటం చేస్తామని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి రాష్ట్ర కోకన్వీనర్లు తలమల్ల హసేన్, మేక వెంకన్న, ఎర్రమల్ల రాములు అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని రైతుబజార్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపి మాట్లాడారు. సుప్రీంకోర్టు ఇచ్చిన ఎస్సీ వర్గీకరణ తీర్పును మాలలు వ్యతిరేకించాలని దేశవ్యాప్తంగా నిరసనలు చేపడతామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీ, ఎస్టీ కులాల గణన వెంటనే చేపట్టాలని, అభివృద్ధిపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టరేట్‌లో కలెక్టర్ తేజస్‌నంద లాల్ పవార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు వీర్లాల వేణు, బలరాం, జానకిరాములు, భాగ్యమ్మ, వినయ్, అఖిల్, సైదులు, మురళి, కరుణాకర్, నర్సయ్య, సంజయ్, ప్రకాష్, కృష్ణ, విజయ్, భద్రాచలం, తదితరులు పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న మాలమహానాడు నాయకులు

తండ్రి చేతిలో కుమారుడి హతం

సూర్యాపేట, సెప్టెంబరు 11 : మద్యానికి బానిసై తరుచూ వేధిస్తున్న కుమారుడిని తండ్రి హతమార్చాడు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా ఆత్మకూరు(ఎస్) మండలం కొత్తతండా పరిధిలోని బాపూజీతండాలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. మద్యానికి బానిసై డబ్బుల కోసం వేధిస్తున్న కుమారుడు బానోత్ కిరణ్(37)ని అతడి తండ్రి పంతులు గొడ్డలితో దాడి చేసి హతమార్చినట్లు స్థానికులు తెలిపారు. కిరణ్ తన తండ్రిని తరుచూ డబ్బులు ఇవ్వాలంటూ వేధిస్తూ ఉండేవాడని, బుధవారం సాయంత్రం భార్య బంధువుల ఇంటికి వెళ్లగా, ఇంట్లో ఎవరూ లేని సమయంలో తండ్రి పంతులుతో కిరణ్ మద్యంమత్తులో గొడవపడినట్లు స్థానికులు తెలిపారు. విసిగివేసారిన తండ్రి పంతులు పక్కన ఉన్న గొడ్డలితో కిరణ్‌పై దాడి చేయడంతో తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడని తెలిపారు. చుట్టుపక్కల వారు గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్ఐ సైదులు, సూర్యాపేట రూరల్ సీఐ సురేందర్‌రెడ్డి క్లూస్‌టీంతో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. పంతులు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. కిరణ్‌కు భార్య సౌజన్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కాగా పంతులు వ్యవసాయ పనులు చేస్తూ జీవిస్తుండగా, కిరణ్ మద్యానికి బానిసై ఏపనీ చేయడం లేదు. ఘటనపై ఇంకా ఫిర్యాదు అందలేదని ఎస్ఐ తెలిపారు.

పిచ్చికుక్క స్వైరవిహారం

ఐదుగురు బాలురకు గాయాలు

చివ్వెంల, సెప్టెంబరు 11:సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలంలో పిచ్చికుక్కదాడిలో ఐదుగురు బాలురు గాయపడ్డారు. చందుపట్ల(బీ) గ్రామంలో ఇద్దరు ఎస్సీ హాస్టల్ విద్యార్థులు ఉన్నట్లు సమాచారం. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామంలోని ఎస్సీ కాలనీలో ఆరుబయట ఆడుకుంటున్న శిగ జశ్విత్, కాసాని సోన్విత్, సిద్దోజు వివేక్‌లు సాయంత్రం సమయంలో ఆడుకుంటున్నారు. అదే సమయంలో గ్రామంలో కొద్దిరోజులుగా తిరుగుతున్న పిచ్చికుక్క బాలురపై దాడి చేసింది. అనంతరం ఎస్సీ బాలుర హాస్టల్‌లో చదువుకుంటున్న విద్యార్థులు బయట నిల్చోగా వారిపై దాడిచేసింది. పిచ్చికుక్క దాడిలో మొత్తం ఐదుగురు బాలురకు స్వల్పంగా గాయపడ్డారు. వారిని చికిత్స నిమిత్తం సూర్యాపేట ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తల్లిదండ్రులు తీసుకెళ్లారు.

అదుపు తప్పిన ప్రైవేట్ పాఠశాల బస్సు

మేళ్లచెర్వు, సెప్టెంబరు 11: సూర్యాపేట జిల్లా మేళ్లచెర్వు మండలంలో డ్రైవర్ అప్రమత్తతతో ప్రైవేట్ పాఠశాల బస్సుకు ప్రమాదం తప్పింది. ఆ సమయంలో బస్సులో 30మంది విద్యార్థులున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. చింతలపాలెం మండలంలోని పలు గ్రామాల నుంచి విద్యార్థులను మండల కేంద్రానికి తీసుకువస్తున్న ప్రైవేట్ స్కూల్ బస్సు బుధవారం మండల కేంద్రానికి సమీపంలో రైల్వే అండర్ బ్రిడ్జి పక్కన ఉన్న డైవర్షన్ రోడ్డులో అదుపుతప్పింది. రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణం కోసం ప్రధాన రహదారిని నిలిపివేసిన అధికారులు రైల్వేట్రాక్ పక్కన డైవర్షన్ రోడ్డును తాత్కాలికంగా ఏర్పాటుచేశారు. ఇటీవలి భారీవర్షాలకు రోడ్డు పూర్తి స్థాయిలో ధ్వంసమైంది. డైవర్షన్ రోడ్డులో భారీ గుంతలు ఏర్పడ్డాయి. భారీ గుంతల నుంచి తప్పించబోయిన డ్రైవర్ రోడ్డు పక్కగా బస్సు నడిపాడు. పూర్తిగా బురదమయమైన రోడ్డు నుంచి బస్సు టైర్లు ఒక్కసారిగా జారి పక్కన ఉన్న పొలాల సరిహద్దులోకి వెళ్లింది. టైర్లు బురదలో కూరుకుపోయి బస్సు నిలిచిపోయింది. ప్రమాద సమయంలో బస్సులో 30 మంది విద్యార్థులు ఉన్నారు. బస్సు నిదానంగా వెళ్తుండటం, డ్రైవర్ అప్రమత్తతతో బస్సును వెంటనే నిలిపివేసి విద్యార్థులను కిందకు దింపాడు. అటుగా వెళ్తున్న స్థానిక రైతులు ట్రాక్టర్ల సహాయంతో బస్సును బయటకులాగారు. అనంతరం స్కూల్ ఆటోల్లో విద్యార్థులను తరలించారు.



బురదలో చిక్కుకున్న బస్సును లాగేందుకు ఏర్పాట్లు చేస్తున్న స్థానికులు

మహిళా స్వావలంబనలో 'స్వరభారతీ'

గ్రామీణ మహిళలకు ఆర్థికభరోసాతో పాటు వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపేందుకు పిలుపు స్వచ్ఛంద సంస్థ చేపట్టిన కార్యాచరణ ఎంతో మంది జీవితాలను మలుపుతిప్పింది. మూడు దశాబ్దాల కిందట గ్రామీణ మహిళలు ప్రతీ అవసరానికి ఇంటి యజమానులపై ఆధారపడే పరిస్థితి. అలాంటి పరిస్థితుల్లో వారికి ఎదురయ్యే సమస్యలను చర్చించుకోవడంతో పాటు ఆర్థికస్వేచ్ఛ కోసం నెలకొన్నదే సంస్థ పిలుపు. ఆ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటైన స్వరభారతీ మ్యాక్స్ సొసైటీ ఎంతోమంది జీవితాల్లో మార్పు తీసుకువచ్చింది. పిలుపు సంస్థ వ్యవస్థాపకులు ఎం.జనార్ధన్ ఆలోచనలోంచి 1993లో పుట్టిన ఈ సంస్థ ఎంతోమందిని మహిళల జీవితాల్లో వెలుగులు నింపింది. నింపుతోంది.

-తుర్కపల్లి

● తుర్కపల్లి, భువనగిరి మండలాల్లో నిర్వహణ ● నేడు సొసైటీ రజతోత్సవాలు



గ్రామగ్రామాన తిరిగి పేద మహిళలను సమావేశపర్చి వారి పరిస్థితులను విశదీకరించి, పొదుపు పరపతి అవశ్యకతను తెలిపి, వారి అభీష్టంతో రూ.10తో పొదుపు పరపతి మొదలుపెట్టారు. ఏడాదిలో 250 మంది సభ్యులుగా చేరారు. ఎన్నో ఆటుపోట్లను నిష్టూరాలను ఎదుర్కొన్నారు. పిలుపు సంస్థ ఆధ్వర్యంలో 1997 ఆగస్టు నాటికి 9 గ్రామాల్లో 1,026 మంది సభ్యులతో కలిపి స్వరభారతీ పేరున అన్‌రిజిస్టర్డ్ సొసైటీగా రూపొందింది. ఇందులో ఓ సంస్థకు ఉన్నట్లుగానే జనరల్ బాడీని ఏర్పాటుచేశారు. ఆ తర్వాత రెండేళ్లకు 1999 మార్చిలో తొమ్మిది గ్రామాలు 1,026 మంది సభ్యులతో కూడిన మహిళా పరస్పర సహాయ సహకార పొదుపు పరపతి సంఘం లిమిటెడ్ పేరున 1995 మ్యాక్స్ చట్టం కింద స్వరభారతీ మ్యాక్స్ పేరుతో రిజిస్టర్ చేశారు.

వడ్డీ తగ్గిస్తూ.. పొదుపుపై వడ్డీ చెల్లిస్తూ

పిలుపు సంస్థకు 1999-2003 దశలో గ్రామపంచాయతీ 100 గజాల భూమిని విరాళంగా ఇవ్వగా జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ(డీఆర్‌డీఏ)ఆర్థిక సహకారంతో సొంత భవనాన్ని నిర్మించుకున్నారు. మరోపక్క ఒక్కో గ్రామానికి విస్తరిస్తూ 2023 నాటికి 17 గ్రామాలు 1,238 మంది సభ్యులకు సంస్థ చేరుకుంది. చేసుకున్న పొదుపు ద్వారా సభ్యుల అవసరాల మేరకు రుణసహాయం పొంది బతుకుదెరువులను మెరుగుపర్చుకోవడం మొదలుపెట్టారు. సభ్యులకు అందించే రుణాలపై 24శాతం వడ్డీ వసూలు చేస్తూ 12 శాతం వారి పొదుపులో జమచేస్తున్నారు. గ్రామాలన్నింటినీ మూడు క్లస్టర్లుగా ఏర్పాటుచేసి ముగ్గురు ఉద్యోగులను నియమించి సంఘాల నిర్వహణ బాధ్యలను అప్పగించారు. వారికి నిర్వహణపై శిక్షణ అందించారు. 2008లో జరిగిన మ్యాక్స్ వార్షిక సమావేశంలో అప్పులపై వడ్డీని 18శాతానికి తగ్గించి ఇందులో 90శాతం సభ్యుల పొదుపులపై చెల్లించడం ప్రారంభించారు.

ఆదాయంతో పాటు ఆహారం



రామోజీనాయక్‌తండాలో స్వరభారతీ ఏర్పాటుచేసిన ఇందిరా బృందంలో 1999లో సభ్యురాలిగా చేరా. మా తండాలో ఇంతకు ముందు జొన్నలు, సజ్జలు బాగా పండించేవారు. కానీ ఐదేళ్ల నుంచి జొన్న సాగు మానేశారు. ఈ సంగతి మా బృందంలో చర్చించుకొని తిరిగి జొన్న పంటను పునరుద్ధరించాలని తీసుకున్న నిర్ణయం మేరకు జొన్న సాగు చేస్తున్నా. అందుకు అనుబంధంగా వ్యాపార పంటైన బంతిని కూడా వేశా. దీంతో మా కుటుంబసభ్యులకు పౌష్టికాహారం లభిస్తుంది, జొన్న సాగు చేసే వారికి పెట్టుబడి సాయం కూడా ఇస్తున్నారు. ఈ పంటల సాగుతో కొంత ఆదాయం పౌష్టికాహారం లభిస్తోంది.

-గుగులోతు అంబి, రామోజీనాయక్‌తండా

బ్యాంకుల రుణసాయం

2009-2013 మధ్యలో 20గ్రామాల్లోని 2,843 మంది సభ్యులను 206 బృందాలుగా స్టేట్ బ్యాంక్ వారి సహకారంతో ఏర్పాటు చేసి, బృందాల పేరున బ్యాంక్ ఖాతాలను తెరిచి అప్పటివరకు సమకూరిన పొదుపులు, పొదుపులపై చెల్లించిన వడ్డీని ఖాతాల్లో జమచేశారు. అప్పటి నుంచి బృందాలస్థాయిలో సభ్యుల సమష్టి నిర్ణయం మేరకు ఆర్థిక లావాదేవీలు ప్రారంభమయ్యాయి. ఈ బృందాలకు మ్యాక్స్ వారి పూచీకత్తుపై హెచ్‌డీఎఫ్‌సీ నుంచి రూ.1.30కోట్లు, ఎస్‌బీఐ తుర్కపల్లి నుంచి రూ.2కోట్ల రుణసాయం అందాయి. వలస పోయిన వృద్ధులు సభ్యత్వాలను విరమించుకున్నారు. ఎప్పటికప్పుడు ఈ బృందాలను పర్యవేక్షిస్తూ అవసరమైన పద్ధతులను రూపొందించుకొని నిరంతరం సంఘ సమావేశాల్లో పాల్గొని సభ్యులను జాగ్రతం చేసి ముందుకు సాగారు. లెక్కల్లో తప్పొప్పులను సరిచేసుకుంటూ బుక్‌కీపర్లకు తగిన శిక్షణ ఇచ్చారు. కేవలం ఆర్థిక లావాదేవీలే కాకుండా ప్రకృతి వ్యవసాయ పద్ధతులు, మహిళా, పేదల సమస్యలపై పనిచేయడం ప్రారంభించారు. ఇదిలా ఉండగా 2018 నుంచి బుక్‌కీపర్లకు బృందాల ఆర్థిక పరిపుష్టిని బట్టి రూ.500 నుంచి రూ.300 వరకు రుసుం చెల్లిస్తున్నారు. మిగులు లేని బృందాలకు ఉచితసేవ అందిస్తున్నారు. భవిష్యత్‌లో పిలుపు సంస్థ లేకపోయినా స్వరభారతీ మ్యాక్ ఈ ప్రాంతాల్లోని మహిళలకు అండగా ఉంటుందని భరోసా ఇక్కడి మహిళల్లో కనిపిస్తోంది.

ఖర్చులు పోనూ రూ.10 వేల ఆదాయం

ఇంతకు ముందు పౌల్ట్రీఫాం ఉండేది. దాంతో వచ్చే ఆదాయం అవసరాలకు సరిపోయేదికాదు. భావన పొదుపు బృందం నుంచి చిన్నమొత్తాల్లో చాలాసార్లు అప్పు తీసుకోని కుటుంబ అవసరాలు తీర్చుకున్నా.ఇప్పుడు రూ.70వేల అప్పు తీసుకుని జిరాక్స్ మిషన్ పెట్టుకున్నా. ఖర్చులన్నీ పోను నెలకు రూ.10వేల వరకు ఆదాయం వస్తుంది. స్వరభారతికి ధన్యవాదాలు.



వలందాసు లావన్య, రుస్తాపూర్

2024 మార్చి నాటికి	
గ్రామాలు :	14
సభ్యులు :	2,089
బృందాలు :	166
పొదుపులు :	రూ.4.73కోట్లు
మిగులు :	రూ.1.24కోట్లు

ఈ నెల 12న స్వరభారతీ రజితోత్సవాలు

పిలుపు స్వచ్ఛంద సంస్థ సహకారంతో 1995లో స్వరభారతీ మ్యాక్స్ సొసైటీ రిజిస్ట్రేషన్ అయ్యింది. సొసైటీ ఏర్పాటై 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఈ నెల 12న రజతోత్సవాలను నిర్వహించేందుకు ఏర్పాట్లుచేశారు. ఈ వేడుకలకు ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి హాజరవుతున్నట్లు మ్యాక్స్ మేనేజర్, బోర్డు అధ్యక్షురాలు సుమలత తెలిపారు.

● భవిష్యత్‌లో మరింత ముందుకు



30ఏళ్లుగా నడుస్తున్న స్వరభారతీ మ్యాక్స్ తమ అనుభవాలను తీసుకుని భవిష్యత్‌లో ఇదే స్ఫూర్తితో సమాజంలో పేదలు, మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలి. ఆ దిశగా పనిచేయాలని ఆకాంక్షిస్తున్నా.

ఎం.జనార్ధన్, పిలుపు సంస్థ ఎగ్జిక్యూటీవ్, డైరక్టర్

● సిల్వర్ జూబ్లీ జరుపుకోవడం సంతోషం



గత 25 ఏళ్లుగా స్వరభారతీ మాక్స్ ద్వారా ఎలాంటి ఒడిదుడుకులు లేకుండా ఆర్థిక లావాదేవీలు నిర్వహిస్తూ నేడు సిల్వర్ జూబ్లీ వేడుకలు నిర్వహించుకోవడం తనతో పాటు గ్రూప్ సభ్యులందరూ సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

- కొడారి సుమలత, స్వరభారతీ మ్యాక్స్ అధ్యక్షురాలు

ఆర్థిక లావాదేవీలు నిర్వహిస్తూ



స్వరభారతీ మ్యాక్స్ ప్రారంభం నుంచి మేనేజర్‌గా పనిచేస్తున్నా. ముఖ్యంగా ఆర్థిక లావాదేవీలు నిర్వహిస్తూ బోర్డు, బుక్‌కీపర్ల సమావేశాలు నిర్వహిస్తా. అంతే కాకుండా గ్రామస్థాయిలోని బృందాల ఆర్థిక లావాదేవీలను ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తుంటా. రాబోయే తరం యువతులు స్వరభారతీలో కీలకపాత్ర తీసుకుని ముందుకు నడిపించాలని ఆకాంక్షిస్తున్నాం.

- జీ లక్ష్మి, స్వరభారతీ మ్యాక్స్ మేనేజరు

బీసీ రిజర్వేషన్లు పెంచకపోతే ఉద్యమం ఉధృతం

● బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య



సమావేశంలో మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య

నల్లగొండ రూరల్, సెప్టెంబరు 10 : పంచాయతీ రాజ్ సంస్థల్లో బీసీ రిజర్వేషన్లను 20 నుంచి 42 శాతానికి పెంచాలని, లేకుంటే ఉద్యమ ఉధృతం చేస్తామని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య హెచ్చరించారు. బీపీ మండల్ 106 జయంతిని పురస్కరించుకొని బుధవారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని కోర్టు ఎదురుగా బీపీ మండల్ విగ్రహం వద్ద నిర్వహించిన జయంతి వేడుకల్లో ఆయన పాల్గొని, మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల సమయంలో స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లను 42 పెంచుతామని హామీ ఇచ్చిందన్నారు. ఆ మేరకు హామీని నిలబెట్టుకోవాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు అక్టోబరు నెలాఖరు వరకు జరుపుతామని ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం ఒక వైపు కులగణన చేయాలని నిర్ణయం తీసుకుందన్నారు. ప్రభుత్వం ముందుగా బీసీ సంఘాల ఆధ్వర్యంలో కులగణన చేసి, రిజర్వేషన్లు పెంచాలన్నారు. అందుకోసం మూడు నెలలుగా ఉద్యమాలు చేస్తున్నాం, అయినా ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. ఇక రాహుల్‌గాంధీ అయినా స్పందించాలని కోరారు. రాష్ట్రంలో అన్ని రాజకీయ పార్టీలు బీసీ రిజర్వేషన్లకు మద్దతు తెలుపుతారా లేదా ప్రకటన చేయాల్సి ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ నేతలు అందుకు విరుద్ధంగా ఉన్నారన్నారు. కాంగ్రెస్ పార్టీలో బీసీ నేతలు జెండాలు మోసుకుంటు, జిందాబాద్‌లు, బానిసలుగా మారారని, ఇకనైనా ఆ బతుకులకు స్వస్తి చెప్పి ప్రభుత్వంపై ఒత్తిడి కోసం చేసే పోరాటంలో కలిసి రావాలని పిలుపునిచ్చారు. రాజ్యాంగ సవరణ చేయాలి సుప్రీంకోర్టు ప్రకారం తీర్పు ప్రకారం 50శాతం సీలింగ్ అని చెప్పి పెంచకుండా తప్పించుకోవడానికి వీలులేదన్నారు. ఇప్పటికే అగ్రకులాలకు 10శాతం రిజర్వేషన్లు పెట్టి 50శాతం సీలింగ్‌పై పార్లమెంట్ రాజ్యాంగ సవరణ చేసిందన్నారు. ఆ అగ్రకులాలకు రిజర్వేషన్లను పెంచడానికి మూడు రోజుల్లో లోక్‌సభ, రాజ్యసభలో రాజ్యాంగ సవరణ చేసి రాష్ట్రపతి సంతకం చేశారు కానీ 50 శాతం జనాభా గల బీద కులాలకు రాజ్యాంగ సవరణ చేయరా ఇదేం న్యాయమని ప్రశ్నించారు. రిజర్వేషన్ల పెంపుపై కాంగ్రెస్ పార్టీ తన హామీని నిలబెట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో రాజారాంయాదవ్, సంఘం జిల్లా అధ్యక్షుడు దూకుడుకు లక్ష్మీ నారాయణ, నీల వెంకటేశం, పిల్లి రామరాజు, వంగూరి నారాయణయాదవ్, ప్రసన్న, శిరందాసు రామదాసు, సత్తయ్య, సర్పాల వెంకన్న, అల్లి వేణు, మామిడి పద్మ, సింగం లక్ష్మీ, కొండూరు సత్యనారాయణ, గోవార్ధన్, గద్దె నాగరాజు, సతీష్ యాదవ్, వల్లేకీర్తి శ్రీనివాస్, మచ్చ గిరి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రం ఎదగాలంటే బీజేపీ రావాలి

● మల్కాజ్‌గిరి ఎంపీ రాజేందర్



గిరిజన మహిళకు సభ్యత్వ నమోదు పత్రాన్ని అందజేస్తున్న ఎంపీ ఈటల

రామగిరి, సెప్టెంబరు 11: తెలంగాణ రాష్ట్రం గొప్పగా ఎదగాలంటే బీజేపీ అధికారంలోకి రావాల్సిందేనని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి, మాట్లాడారు. అవినీతి, కుటుంబపాలన లేని పార్టీ ఏదైనా ఉందంటే అది బీజేపీ పాలన మాత్రమేనని అన్నారు. దేశం అభివృద్ధి కోరుకునే ప్రతి ఒక్కరూ బీజేపీ సభ్యత్వాన్ని తీసుకొని దేశ భవిష్యత్‌కు నాంది పలకాలన్నారు. దేశం కోసం, ధర్మం కోసం పని చేసే పార్టీ కూడా బీజేపీనే అని అన్నారు. ప్రతీ బూత్‌లో సభ్యత్వ నమోదును విరివిగా చేసి రాష్ట్రంలోనే జిల్లాను ముందుంచాలని కార్యకర్తలు పిలుపునిచ్చారు. ప్రజలకు బీజేపీ మీద విశ్వసం ఉంది కాబట్టే నరేంద్రమోదీని మూడోసారి కూడా గెలిపించుకున్నారని గుర్తు చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు వీరెళ్లి చంద్రశేఖర్, మాదగాని శ్రీనివాస్‌గౌడ్, బండారు ప్రసాద్, పిల్లి రామరాజుయాదవ్, గోలి మధుసూదన్‌రెడ్డి, పోతేపాక సాంబయ్య తదితరులు ఉన్నారు. నల్లగొండలోని పాతబస్తీలో ఏర్పాటుచేసిన ఒకటో నెంబర్, 19వవార్డులో ఏర్పాటు చేసిన వినాయకులను ఈటల దర్శించుకున్నారు.

● ఆర్టీసీ పెన్షనర్లకు ఈపీఎఫ్ డిమాండ్ లేఖలు ఇప్పించాలని ఆర్టీసీ పింఛన్‌దారులు దాసోజు శేఖరాచారి, వీఎస్‌పి రావు, పీవై రెడ్డి, దశరథ కోరారు.



ఈటలకు వినతిపత్రం అందజేస్తున్న పెన్షన్‌దారులు

పిల్లల్లో వ్యాధి నిరోధక శక్తి ఎలా ఉంది?



చిట్యాల పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలిస్తున్న డబ్ల్యూహెచ్‌వో డాక్టర్లు

చిట్యాల, సెప్టెంబరు 11: పిల్లల్లో వ్యాధి నిరోధక శక్తి ఎలా ఉంది? ఇమ్యూనైజేషన్ ప్రక్రియ ఎలా ఉంది, ఫలితాలు ఎలా ఉన్నాయని ప్రపంచ ఆరోగ్య సంస్థకు (డబ్ల్యూహెచ్‌వో) చెందిన వైద్యులు ఎస్.అనూష, డేవిడ్ ఆరా తీశారు. బుధవారం నల్లగొండ జిల్లా చిట్యాల మండల కేంద్రంలోని పీహెచ్‌సీని డబ్ల్యూహెచ్‌వో వైద్యుల బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా వారు ఆస్పత్రిలో అందుతున్న సేవలు, ఇమ్యూనైజేషన్ ప్రక్రియను పరిశీలించారు. ఎంత మందికి టీకాలు(ఇమ్యూనైజేషన్) వేశారు? వాటి ఫలితాలు ఎలా ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ ఎస్.పద్మ మాట్లాడుతూ టీకాలు వేయించుకుంటే 14రకాల వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చని తెలిపారు. అంటువ్యాధులు ప్రబలకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ముఖ్యంగా నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకుని దోమలను నివారించాలని కోరారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి వెంకటేశ్వర్లు, ఎస్‌పీవో కృష్ణ, ఆసుపత్రి సిబ్బంది నర్సింగరావు, ఉదయ్‌రాజు తదితరుల పాల్గొన్నారు.

గొంతుకోసి యువకుడి హత్య



కిరణ్(ఫైల్‌ఫొటో)

నాగారం, సెప్టెంబరు 11: పాతకక్షల నేపథ్యంలో ఓ యువకుడి గొంతు కోసి దారుణంగా హత్య చేశారు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా నాగారం మండలంలో బుధవారం ఉదయం వెలుగుచూసింది. యువకుడి మృతదేహాన్ని ఎస్సారెస్పీ కాల్వలో పడేయడంతో స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. నాగారం సీఐ రఘువీర్‌రెడ్డి, ఎస్ఐ ఐలయ్య తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తిరుమలగిరి మునిసిపాలిటీకి చెందిన వనగండ్ల కిరణ్‌కుమార్(27) కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం రాత్రి 10.30 గంటల సమయంలో తిరుమలగిరి పరిధిలోని హిల్స్‌కాలనీ నుంచి బైక్‌పై వెళ్తున్నాడు. కిరణ్‌ను గుర్తు తెలియని వ్యక్తులు అడ్డగించి అతడిపై కత్తులతో దాడి చేశారు. స్పృహకోల్పోయిన కిరణ్‌ను కారులో నాగారం మండలం డీ.కొత్తపల్లి గ్రామశివారులోని ఎస్సారెస్పీ కాల్వ వద్దకు తీసుకెళ్లారు. అక్కడికి వెళ్లాక కిరణ్‌ను గొంతుకోసి చంపారు. మృతదేహాన్ని కాల్వలో పడవేసి దుండగులు అక్కడి నుంచి వెళ్లిపోయారని సీఐ తెలిపారు. బుధవారం ఉదయం కాల్వ వెంట పొలాలకు వెళ్తున్న స్థానికులకు కాల్వలో యువకుడి మృతదేహం కనిపించిందన్నారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వెళ్లి పంచనామా నిర్వహించినట్లు సీఐ తెలిపారు. కిరణ్‌కుమార్ అవివాహితుడు కాగా అతడి సోదరుడు సాయికుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. త్వరలో దుండగులను పట్టుకుని హత్యకు దారితీసిన కారణాలను ప్రకటిస్తామన్నారు. సంఘటనా స్థలాన్ని సూర్యాపేట డీఎస్పీ జీ రవి పరిశీలించారు. డాగ్ స్క్వాడ్, క్లూస్‌టీం, ఫోరెన్సిక్ బృందాలు ఆధారాలు సేకరించాయి.

హత్యకు వివాహేతర సంబంధమేనా కారణమా?

దుండగుల దాడిలో చేతిలో హత్యకు గురైన కిరణ్‌కుమార్‌కు తిరుమలగిరికి చెందిన మహిళతో వివాహేతర సంబంధం ఉందని అనుమానిస్తున్నారు. ఈ విషయంలో కిరణ్‌తో గతంలో ఓ వ్యక్తి గొడవ పడినట్లు సమాచారం. మృతుడి సోదరుడు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పత్తెపురం విజయ్‌తో గతంలో గొడవపడ్డాడని,అతడే తన తమ్ముడిని హత్య చేశాడని అనుమానం వ్యక్తం చేశాడు. ఆ దిశగా విచారణ చేసి, నేరస్తులను పట్టుకుంటామని సీఐ తెలిపారు.

దుండగులను అరెస్ట్ చేయాలని రాస్తారోకో



తిరుమలగిరిలో రాస్తారోకో చేస్తున్న వారితో మాట్లాడుతున్న పోలీసులు

తిరుమలగిరి : తిరుమలగిరికి కేంద్రానికి చెందిన కిరణ్‌ను కిరాతంగా హత్యచేసిన దుండగలను వెంటనే అరెస్ట్ చేయాలని కుటుంబసభ్యులు తిరుమలగిరి పట్టణంలో ఆందోళన చేశారు. జనగామ- సూర్యాపేట రహదారిపై అంబేడ్కర్‌నగర్ వద్ద రాస్తారోకో నిర్వహించారు. సీఐ రఘువీర్‌రెడ్డి, ఎస్ఐ సురేష్‌లు ఆందోళనకారులకు నచ్చజెప్పి ఆందోళన విరమింపచేశారు. అంబేడ్కర్‌నగర్‌లో పోలీసులు గట్టి బందోబస్త్ ఏర్పాటుచేశారు.

లారీ క్యాబిన్ నుంచి పడి క్లీనర్ మృతి

హుజూర్‌నగర్, సెప్టెంబరు 11 : సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో లారీ క్యాబిన్ నుంచి పడి క్లీనర్ మృతి చెందాడు. ఎస్ఐ ముత్తయ్య తెలిపిన వివరాల ప్రకారం సూర్యాపేట మండలం దుబ్బతండాకు చెందిన జాటోత్ నెహ్రూ(30) లారీక్లీనర్‌గా పనిచేస్తున్నాడు. తమ్ముడు శరత్ లారీడ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కాగా మేళ్లచెర్వు మండలంలో సిమెంట్ లోడ్ కోసం మంగళవారం రాత్రి హుజూర్‌నగర్ బైపాస్ రోడ్డులో లారీలో వెళ్తున్నారు. ఆ సమయంలో నెహ్రూ క్లీనర్ ప్లేస్‌లో కూర్చొని లారీ డోర్ వేసేందుకు ప్రయత్నించి కిందపడగా లారీ టైర్లు అతడి మీది నుంచివెళ్లాయి. దీంతో నెహ్రూ అక్కడికక్కడే మృతి చెందాడు. నెహ్రూ తండ్రి హనుమా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ముత్తయ్య తెలిపారు.

విద్యుదాఘాతంతో ఒకరు మృతి

చిట్యాలరూరల్, సెప్టెంబరు 11 : నల్లగొండ జిల్లా చిట్యాల మండలం పేరేపల్లిలో విద్యుదాఘాతంతో ఒకరు మృతి చెందారు. గ్రామానికి చెందిన పోలోజు వెంకటాచారి(50) తన నివాస సమీపంలోనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ ఎర్త్ వైర్ తగిలి బుధవారం రాత్రి కిందపడిపోయాడు. కొద్దిసేపటికి అతడిని వినాయక మంట నిర్వాహకులు గమనించే సరికి మృతి చెందాడు. విషయాన్ని స్థానికులకు, కుమారుడు శంకరాచారికి తెలిపారు. వెంకటాచారి భార్య ఐదేళ్ల కిందట మృతి చెందగా వారికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.

యదాద్రి థర్మల్ పవర్ స్టేషన్

పనులు చకచకా



వైటీపీఎస్ విద్యుదుత్పత్తి యూనిట్

దామరచర్ల, సెప్టెంబరు 11 : నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం వీర్లపాలెం చేపట్టిన యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్(వైటీపీఎస్) పనులు చకచకా సాగుతున్నాయి. బుధవారం రెండో యూనిట్‌లో సింక్రనైజేషన్ ప్రక్రియను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రారంభించారు. ఆయన వెంట జిల్లా మంత్రులు కోమటి రెడ్డి వెంకట్‌రెడ్డి, నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో పాటు మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ఉన్నారు. ఇప్పటికే మొదటి యూనిట్‌లో సింక్రనైజేషన్ ప్రక్రియ పూర్తయ్యింది. మొదటి, రెండో యూనిట్‌కు సంబంధించిన పనులను అధికారులు వేగంగా పూర్తి చేస్తున్నారు. దీంతో ఈ ఏడాది డిసెంబరు నాటికి విద్యుదుత్పత్తిని ప్రారంభించే అవకాశాలు ఉన్నాయి.



విద్యుదుత్పత్తి యూనిట్‌ను పరిశీలిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి





విద్యుదుత్పత్తి యూనిట్‌లోని విద్యుత్ మోటార్లు, ఇతర యంత్రాలు



యూనిట్ 2 ప్రవేశమార్గం



విద్యుదుత్పత్తిని మానిటరింగ్ చేసే కాన్ఫరెన్స్‌హాల్

రోడ్లు ధ్వంసం.. భయంతో ప్రయాణం

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రోడ్లు కోతకు గురవ్వడంతో పాటు ధ్వంసమయ్యాయి. అడుగడుగునా గుంతలు ఏర్పడటంతో రాకపోకలకు వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. ఏమాత్రం అజాగ్రతగా ఉన్నా ప్రమాదాల బారిన పడే అవకాశం ఉంది. ప్రభుత్వం స్పందించి ధ్వంసమైన రోడ్లకు మరమ్మతు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

● నడిగూడెం, పెన్‌పహాడ్, చిలుకూరు

వరద తాకిడికి నడిగూడెం మండలంలో కాగిత రామచంద్రపురం, రత్నవరం, తెల్లబెల్లి, చాకిరాల, నారాయణపురం, తదితర గ్రామాల్లో ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్ రోడ్లు కోతకు గురయ్యాయి. వర్షాలు తగ్గుముఖం పట్టడంతో రహదారులు ఛిద్రంగా కనిపిస్తున్నాయి. ప్రధానంగా సాగర్ ఎడమ కాల్వకు రెండు చోట్ల గండ్లు పడటంతో కాగిత రామచంద్రపురం నుంచి ఖమ్మం



చిలుకూరు: బేతవోలు వీర్లదేవి చెరువు నుంచి రోడ్డుపైకి వస్తున్న నీరు



పెన్‌పహాడ్‌లో రోడ్డుపై ఏర్పడిన భారీ గుంత

జిల్లాకు వెళ్లే రహదారి పూర్తిగా ధ్వంసమైంది. ఈ పరిధిలోని చిన్న వాగు వంతెనపై నుంచి నీరు ప్రవహించినందున వంతెన ఇరువైపులా కోతకు గురై ప్రమాదకరంగా మారింది. తారు రోడ్డు కంకర తేలి అడుగడుగున గుంతలు పడి ప్రయాణానికి వీలులేకుండా ఉంది. జిల్లా నుంచి వైద్యం కోసం ఖమ్మం జిల్లా కేంద్రానికి, వారంతపు సంత కోసం కూసుమంచి మండలం పాలేరు నాయకన్‌గూడేనికి వెళుతుంటారు. ప్రస్తుతం ఈ రహదారి అస్తవ్యస్తంగా ఉన్నందున ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వ్యయప్రయాసలకు ఓర్చి ప్రయాణికులు చెన్నకేశవపురం, వల్లభాపురం నుంచి చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తోంది. సాగు ఎడమ కాల్వ గండ్లు పూడ్చే లోపు ధ్వంసమైన రోడ్లకు మరమ్మతు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

● వర్షాలకు పెన్‌పహాడ్, ఇమాంపేట నుంచి లింగాల క్రాస్ రోడ్డు వరకు బీటీ రోడ్డులో పెద్ద పెద్ద గుంతలు పడ్డాయి. సూర్యాపేట నుంచి మిర్యాలగూడెం, నేరేడుచర్ల వెళ్లే ఆర్టీసీ బస్సులు, లారీలు నిత్యం ఈ రోడ్డులోనే రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ గుంతలో ప్రమాదం జరిగే అవకాశం ఉందని స్థానికులు చెబుతున్నారు. అదేవిధంగా మాచారం నుంచి తంగెళ్లగూడెం, దూపహాడ్ నుంచి చెట్లముకుందా పురం, దూపహాడ్ క్రాస్ రోడ్డు నుంచి లింగాల, అన్నారం నుంచి లింగాల, ధర్మాపురం నుంచి మెట్టుకొండ, మాచారం క్రాస్ రోడ్డు నుంచి పొట్లపహాడ్, దోసపహాడ్ నుంచి అనాజీపురం వరకు రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఈ రోడ్లలో ప్రయాణం చేయాలంటే ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారు. ప్రభుత్వం స్పందించి రోడ్లకు యుద్ధప్రాతిపదికన మరమ్మతు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.



నడిగూడెం మండలంలో ధ్వంసమైన రోడ్డు

● చిలుకూరు మండలంలోని బేతవోలు గ్రామ శివారులో వీర్లదేవి చెరువు తూము నుంచి నీరు రోడ్డుపై ప్రవహిస్తున్నందున వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చెరువుకు పరిమితికి మించి వరద వస్తున్నందున తూము నుంచి నీటిని బయటికి విడుదల చేస్తున్నారు దీంతో నీటి ఉధృతికి రోడ్డు కొట్టుకుపోయి పెద్దపెద్ద గోతులు ఏర్పడ్డాయి. ఈ గోతుల్లో నీరు ప్రవహిస్తున్నందున అర్థంకాక వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు చేయించాలని వాహనదారులు కోరుతున్నారు.

వరద బాధితులను ఆదుకుంటాం



సమావేశంలో మాట్లాడుతున్న వరప్రసాద్‌రెడ్డి

కోదాడ రూరల్, సెప్టెంబరు 11: భారీ వర్షాలతో నష్టపోయిన ప్రతి ఒక్కరినీ ఆదుకుంటామని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తూమాటి వరప్రసాద్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని గుడిబండ గ్రామంలోని తన ఇంటిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వరదలతో మండలంలో 1100కుటుంబాలు నిరాశ్రయులయ్యాయని, ఒక్కో కుటుంబానికి రూ.1400విలువైన నిత్యావసర సరుకులు పంపిణీ చేశామన్నారు. 20 ఇళ్లు పూర్తిగా కూలిపోగా, తాత్కాలికంగా ఒక్కో ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ.1.30లక్షలు మంజూరు చేసిందన్నారు. మండలంలో 10వేల ఎకరాలకు పైగా పంట నష్టం జరిగిందని, రైతులుకు ప్రభుత్వ నష్టపరిహారం చెల్లిస్తుందన్నారు. వరదలపై మంత్రి ఉత్తమ్, ఎమ్మెల్యే పద్మావతిరెడ్డిలపై బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న ఆరోపణలను ఖండించారు. ఈ సమావేశంలో బాశబోయిన భాస్కర్ నంబూరి సూర్యం, అమరనాయిని వెంకటేశ్వరరావు, ఇర్ల సీతారాంరెడ్డి, ఓ.శ్రీనివాస్‌రెడ్డి, వెంకటాచారి, శరభయ్య, నరోత్తంరెడ్డి, రహీం, ఇబ్రహీం, బెంజిమెన్, నాగరాజు పాల్గొన్నారు.

'సంజీవరెడ్డి ఆశయాలను సాధిస్తాం'

తుంగతుర్తి, సెప్టెంబరు 11: సీపీఐ(ఎంఎల్) రాష్ట్ర నాయకుడు దుబ్బాక సంజీవరెడ్డి ఆశయాలను సాధిస్తామని సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ జిల్లా కమిటీ సభ్యుడు పేర్ల నాగయ్య అన్నారు. సంజీవరెడ్డి వర్థంతిని బుధవారం మండల కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సంజీవరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఏర్పుల లక్ష్మయ్య, నర్సయ్య, పరశురాం, సుధాకర్, యాకుబ్ హుస్సేన్, భాస్కర్, నారాయణ, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

సూర్యాపేట టౌన్: సీపీఐ(ఎంఎల్) రాష్ట్ర నాయకుడు దుబ్బాక సంజీవరెడ్డి ఆశయాలను యువత సాధించాలని సీపీఐ(ఎంఎల్)మాస్ లైన్ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్ అన్నారు. సంజీవరెడ్డి వర్థంతి సందర్భంగా బుధవారం కేంద్రంలోని విక్రమ్ భవన్‌లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. ఉపాధ్యాయ వృత్తిని వదిలేసి ప్రజా సమస్యలపై పోరాటాలు చేసిన మహోన్నతుడు సంజీవరెడ్డి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు కారింగుల వెంకన్న, ఎర్ర అఖిల్‌కుమార్, పీవోడబ్ల్యూ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి రేణుక, సూరం రేణుక, సంతోషిమాత, పద్మ, రేణుక , లింగయ్య, మోహన్, అంజయ్య, ఉపేందర్, నాగరాణి పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

తుంగతుర్తి, సెప్టెంబరు 11: వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులకు ఎకరానికి ప్రభుత్వం రూ.30వేలు నష్టపరిహారం చెల్లించాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి మందరి డేవిడ్‌కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పంటనష్టం ఎకరానికి రూ.30వేలు, చనిపోయిన పశువులకు రూ.70వేలు, గొర్రెలు, మేకలకు రూ.10వేలు ఇవ్వాలని, ఇళ్లు కూలిపోయిన వారికి కొత్త ఇళ్లను నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గంట నాగయ్య, బొడ్డు శంకర్, పోలెబోయిన కిరణ్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

పాలకవీడు: వరదలతో పంటలు నష్టపోయిన రైతులకు వెంటనే నష్టపరిహారం అందించాలని బీఆర్ఎస్ మండల యూత్ నాయకుడు పెరుమళ్ల సతీష్ అన్నారు. బుధవారం పాలకవీడు మండలంలో రాఘవాపురం, మీగడంపాడు తండాలో వరదలతో నష్టపోయిన పంటలను పరిశీలించి మాట్లాడారు. ఎకరాకు ప్రభుత్వం రూ.15వేల నష్ట పరిహారం అందించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మంద నాగయ్య, కరుణాకర్, పున్నయ్య, దాసు, నవీన్ పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

మునగాల రూరల్, సెప్టెంబరు 11: ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలోని తాడ్వాయి గురప్ప వాగుపై ఉన్న తాత్కాలిక రోడ్డు నీట మునిగి తెగింది. దీంతో వాహనాలు రాకపోకలు నిలిచిపోవడంతో సమాచారం అందుకున్న ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి ఈ ప్రాంతాన్ని పరిశీలించారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు ఫార్మేషన్ రోడ్డు నిర్మాణ పనులను అధికారులు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పద్మావతికి కాంగ్రెస్ పార్టీ తాడ్వాయి గ్రామశాఖ అధ్యక్షుడు వట్యాల సైదులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూత్ మండల అధ్యక్షుడు జిల్లపెల్లి శ్రీనివాస్, గట్టు ఉపేందర్, సోమపంగు గోపి, గిరిజన శక్తి మండల అధ్యక్షుడు మహేష్‌నాయక్ పాల్గొన్నారు.

కోదాడ తహసీల్దార్‌గా వాజిద్ అలీ



వాజిద్ అలీ

కోదాడ రూరల్, సెప్టెంబరు 11: కోదాడ తహసీల్దార్‌గా ఎండీ వాజిద్ అలీ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన తహసీల్దార్ సాయిగౌడ్‌పై పలు అవినీతి ఆరోపణలు రావడంతో ఆయనను కలెక్టరేట్‌కు బదిలీ చేశారు. కలెక్టరేట్‌లోని పనిచేస్తున్న వాజిద్‌అలీని కోదాడ తహసీల్దార్‌గా నియమించారు. ఈ సందర్భంగా వాజిద్‌అలీ మండలంలో రెవెన్యూ సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానన్నారు.

సామాన్యులకు దొరకని ఇసుక: బీఆర్ఎస్

తుంగతుర్తి, సెప్టెంబరు 11: సామాన్యులకు ఇసుక దొరకడంలేదని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య అన్నారు. బుధవారం పట్టణంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరులతో సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మూసీ వాగు నుంచి హైదరాబాద్‌కు లారీల ద్వారా ఇసుక తరలిస్తున్నా, గ్రామీణులకు ఇసుక దొరకడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ఇళ్ల నిర్మాణానికి పేదలు తీవ్ర ఇబ్బందిపడుతున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే ఇసుకకు అనుమతి ఇవ్వాలని కోరారు. ఇసుక లేనందున ట్రాక్టర్ల యజమానులు, భవన నిర్మాణ కార్మికులు జీవనోపాధి కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో నాయకులు గుండగాని రాములుగౌడ్, గోపగాని శ్రీనివాస్, మల్లెపాక వెంకన్న, దశరథ, మల్లేష్, సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి

మునగాల రూరల్, సెప్టెంబరు 11: సీజనల్ వ్యాధులతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో కోటాచలం అన్నారు. బుధవారం మండలంలోని రేపాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని మాధవరం సబ్ సెంటర్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ సిబ్బంది సమయపాలన పాటించాలని, ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. సీజనల్ వ్యాధుల గురించి అవగాహన కల్పించి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే శాఖా పరమైన చర్యలు తీసుకోబడతాయన్నారు. వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని పరిశీలించి అందుతున్న వైద్య సేవలను గర్భిణులు, బాలింతలను అడిగి తెలుసుకున్నారు అనంతరం రికార్డులను పరిశీలించారు. ప్రజలకు అన్నిరకాల మందులు అందుబాటులో ఉన్నాయని, సీజనల్ వ్యాధులు ప్రబలక ముందే వైద్య సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించి వారిని చైతన్యపర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి భాస్కర్‌రాజు, హెల్త్ అసిస్టెంట్లు రామకృష్ణ, లింగయ్య పాల్గొన్నారు.

కబడ్డీకి ప్రభుత్వాలు తోడ్పాటునందించాలి

సూర్యాపేటరూరల్, సెప్టెంబరు 11: కబడ్డీ క్రీడకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తోడ్పాటునందించాలని జిల్లా కబడ్డీ అడ్‌హక్ కమిటీ చైర్మన్ రామినేని భూలోకరావు అన్నారు. ఆదివారం పట్టణంలోని జనగాం క్రాస్ రోడ్డులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు, ప్రోకబడ్డీ నిర్వహణతో దేశంలో కబడ్డీ క్రీడకు ఆదరణ పెరిగిందన్నారు. జిల్లాలో మెరుగైన క్రీడాకారులను గుర్తించి ప్రోకబడ్డీని ప్రోత్సహించాలన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర కబడ్డీ సంఘం కన్వీనర్ కర్తయ్య, సభ్యులు అల్లం ప్రభాకర్‌రెడ్డి, జానీ, రమేష్‌నాయుడు, మధు పాల్గొన్నారు.

బీజేపీకి పెరుగుతున్న ఆదరణ: సంకినేని

పెన్‌పహాడ్, సెప్టెంబరు 11: రాష్ట్రంలో బీజేపీకి ఆదరణ పెరుగుతుందని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వర్‌రావు అన్నారు. బుధవారం రాత్రి పెన్‌పహాడ్ మండల కేంద్రంలో నిర్వహించిన బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అనంతరం సింగారెడ్డిపాలెం గ్రామానికి చెందిన మండల బీజేపీ నాయకుడు తాడోజు జనార్దనాచారి తండ్రి నర్సింహాచారి అనారోగ్యంతో బాధపడుతుండగా పరామర్శించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు, సూర్యాపేట మునిసిపల్ మాజీ చైర్మన్ జుట్టుకొండ సత్యనారాయణ, కేశగాని శోభ, చెన్ను రమణారెడ్డి, నారబోయిన అప్పయ్య, రామారావు పాల్గొన్నారు.

నేరేడుచర్ల: బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నేరేడుచర్ల పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్లా శ్రీలతారెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు సంకలమద్ది సత్యనారాయణరెడ్డి, తాళ్ల నరేందర్‌రెడ్డి, రాంమ్మూర్తి, శంకర్‌రెడ్డి, వెంకన్న, నాగయ్య, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏఆర్ ఎస్ఐ కిశోర్‌కుమార్‌కు అవార్డు



అవార్డు అందుకుంటున్న కిషోర్‌కుమార్, ఝాన్సీ దంపతులు

సూర్యాపేటటౌన్, సెప్టెంబరు 11: జనకళ-వేములవాడ ఆధ్వర్యంలో జీనియస్ బుక్ ఆఫ్ రికార్డును అవార్డును జిల్లా కేంద్రానికి చెందిన ఏఆర్ ఎస్ఐ పల్లె కిశోర్‌కుమార్ అందుకున్నారు. వినాయకచవితి, దసరా పురస్కారాలను పురస్కరించుకుని బుధవారం హైదరాబాద్‌లోని త్యాగరాయగాన సభలో కిశోర్‌కుమార్, ఝాన్సీ దంపతులకే జీనియస్ బుక్ ఆఫ్ రికార్డును ఆలిండియా చీఫ్ కోఆర్డినేటర్ బింగి నరేందర్‌గౌడ్, జువ్వాజి ఆంజయగౌడ్ అందజేశారు. ఈ సందర్భంగా పల్లె కిశోర్‌కుమార్ మాట్లాడుతూ తెలుగు నాటకరంగ పద్యాల గాయకుడిగా, తబలా వాయిద్యకారుడిగా, సామాజిక కార్యకర్తగా చేసిన సేవలకు తనకు అవార్డు వచ్చిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో యాగంటి ప్రసాద్‌బాబు, బూర్గుల మధుసూదన్, కోటేశ్వర్‌రావు పాల్గొన్నారు.

'ఎస్సీ వర్గీకరణపై కార్యాచరణ చేపట్టాలి'

సూర్యాపేట అర్బన్, సెప్టెంబరు 11: ప్రభుత్వాలు సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి ఎస్సీ ఎస్టీ వర్గీకరణ కార్యాచరణ చేపట్టాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు మేడిపాపయ్యమాదిగ అన్నారు. బుధవారం హైదరాబాద్‌లో జరిగిన జిల్లా కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడిగా పడిదల రవికుమార్‌మాదిగను ఏకగ్రీవంగా ఎన్నుకుని, నియామకపత్రం అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చింతబాబుమాదిగ, కనుకు జానయ్య, విజయభాస్కర్, దంతాల వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తా



తిరుమలగిరిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మందుల సామేలు

తిరుమలగిరి, సెప్టెంబరు 11: తుంగతుర్తి నియోజకవర్గాన్ని ఆదర్శంగా అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే మందుల సామేలు అన్నారు. బుధవారం తిరుమలగిరి మునిసిపల్ కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వెనుకబడిన తుంగతుర్తిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే తన ధ్యేయమని అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలుచేస్తానన్నారు. తొమ్మిది నెలల కాలంలోనే తిరుమలగిరికి ప్రభుత్వ జూనియర్ కళాశాల తీసుకువచ్చానన్నారు. తిరుమలగిరిలో ఇండస్ట్రీయల్ పార్కు, ఇంటిగ్రేటెడ్ స్కూలు మంజూరు కృషిచేస్తానన్నారు. బిక్కేరు వాగుపై ఐదు ప్రాంతాల్లో చెక్‌డ్యాంలు పూర్తి చేయించానన్నారు. బిక్కేరు వాగులో అక్రమ ఇసుక రవాణాకు అడ్డుకట్ట వేస్తానని స్పష్టం చేశారు. ప్రభుత్వ అవసరాలకు ఇసుక తీసుకు వెళితే తనకు సంబంధం లేదన్నారు. నియోజకవర్గంలోని నాలుగు వ్యవసాయ మార్కెట్ల కమిటీలను ఈ నెలాఖరు లోపు నియమిస్తామన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పైనరేష్, మునిసిపల్ చైర్‌పర్సన్ శాగంటి అనసూయరాములు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పాలకుర్తి రాజయ్య, జిల్లా అధికార ప్రతినిధి సంకెపల్లి కొండల్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు పేరాల వీరేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ జుమ్మీలాల్, సుంకరి జనార్దన్, కందుకూరి లక్ష్మయ్య, బత్తుల శ్రీను, హఫీజ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడతాం

మేళ్లచెర్వు, సెప్టెంబరు 11: ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడతామని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గున్నా చంద్రశేఖర్ అన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో 76వ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను బుధవారం చింతలపాలెం మండల కేంద్రంలో ప్రారంభించారు. తెలంగాణ సాయుధ పోరాటంలో అమరులైన ఎర్రబోలు అప్పిరెడ్డి, నందిరెడ్డి నర్సిరెడ్డి, ముంగి వీరయ్య, కందుల గోపిరెడ్డి, చింతిర్యాల రామస్వామి, పేరువంగు భూషమ్మ, పేరువంగు తిరుపతమ్మ, అలుగుల వీరమ్మల జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన అమరవీరుల స్థూపానికి నివాళులర్పించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు సృజన, జిల్లా కార్యవర్గ సభ్యుడు ఉస్తెల నారాయణరెడ్డి, సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

హుజూర్‌నగర్ రూరల్: తెలంగాణ సాయుధ పోరాట అమర వీరుల స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్నా చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు కోరారు. తెలంగాణ సాయుధపోరాట వారోత్సవాల్లో భాగంగా సీపీఐ జాత ఆధ్వర్యంలో పట్టణంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యల్లావుల రాములు, కంబాల శ్రీనివాస్, గుండు వెంకటేశ్వర్లు, మల్లీశ్వరి, కృష్ణారెడ్డి, నారాయణరెడ్డి, ధనుంజయనాయుడు, సత్యనారాయణ, జడ శ్రీనివాస్‌యాదవ్ పాల్గొన్నారు.



చింతలపాలెంలో అమరవీరుల స్థూపాలకు నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

గరిడేపల్లి: కమ్యూనిస్టుల సాయుధ పోరాటంతోనే ప్రజలకు విముక్తి కలిగిందని సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు ఉస్తేల సృజన అన్నారు. మండలంలోని పొనుగోడు గ్రామంలో అమరవీరుల స్థూపం వద్ద ఎర్ర జెండా ఎగురవేసి మాట్లాడారు పేదలకు అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో పోకల వెంకటేశ్వర్లు, కంబాల శ్రీనివాస్, మల్లీశ్వరి, అప్పయ్య, కృష్ణారెడ్డి, అంజిరెడ్డి, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

వినాయకుడికి కొనసాగుతున్న పూజలు



నేరేడుచర్లలో గణేష్ శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

నేరేడుచర్ల, సెప్టెంబరు 11: పట్టణంలోని పద్మావతినగర్ శ్రీసాయి అపార్టుమెంటులో ఏర్పాటు చేసిన మండపం నుంచి గణేష్ శోభయాత్రను బుధవారం సాయంత్రం నేరేడుచర్లలో నిర్వహించారు. వినాయకుడిని ట్రాక్టర్‌పై అలంకరించి పట్టణంలో ఊరేగింపు నిర్వహించారు. హుజూర్‌నగర్ రోడ్డులోని గణపతి మండపం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని మునిసిపల్ చైర్మన్ బచ్చలకూరి ప్రకాష్, ఎస్ఐ రవీందర్, కౌన్సిలర్ చిన వెంకటరెడ్డి ప్రారంభించారు నేరేడుచర్ల: గణేష్ నిమజ్జనం కోసం చిల్లేపల్లి మూసీ నది వద్ద ఏర్పాట్లను కోదాడ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి బుధవారం రాత్రి పరిశీలించారు. లారీల్లో తీసుకువచ్చే విగ్రహాలను మహంకాళిగూడెం, వాడపల్లిలోని కృష్ణానదికి పంపాలని సూచించారు. ఆయన వెంట హుజూర్‌నగర్ సీఐ చరమందరాజు, ఎస్ఐ రవీందర్ ఉన్నారు.

హుజూర్‌నగర్: పట్టణంలో పలు ప్రాంతాల్లో గణేష్ శోభాయాత్ర నిర్వహించిన విగ్రహాలను నిమజ్జనానికి మట్టపల్లి కృష్ణానదికి తరలించారు. ఈ కార్యక్రమాల్లో గూడెపు శ్రీనివాస్, అమర్‌నాథ్‌రెడ్డి, రాము, అమర్, సంపత్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, ఓ.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

● హుజూర్‌నగర్‌లో నిర్వహించిన వినాయక పూజా కార్యక్రమంలో ఏఎస్పీ సుంకి సురేందర్‌రెడ్డి, అమర్‌నాథ్‌రెడ్డ, అమర్‌గౌడ్, ఓరుగంటి నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు, పుల్లారావు, రాము, రాంరెడ్డి,పాల్గొన్నారు.

చివ్వెంల: మండలంలోని తిర్మలగిరి గ్రామంలోని యాదవ బజార్‌లో అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు మట్టపల్లి రాముయాదవ్, పబ్బ నాగరాజు,లింగరాజు పాల్గొన్నారు.

మోతె: యూత్ ఆధ్వర్యంలో మండలంలోని రాంపురంతండా, మోతె, మామిళ్లగూడెం, రావిపహాడ్, హుస్సేనాబాద గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాల వద్ద అన్నదానం చేశారు.

తిరుమలగిరి రూరల్: తొండ గ్రామంలో బేతు కుమార్ ఇంటి వద్ద ప్రతిష్ఠించి విగ్రహం వద్ద ఓర్సు చిరంజీవి అన్నదానం చేశారు.

అర్వపల్లి: జాజిరెడ్డిగూడెం, అర్వపల్లి, అడివెంల గ్రామాలల్లో అన్నదానం నిర్వహించారు. ఈకార్యక్రమంలో శ్రీనివాస్, ఎం.రాజలింగం, వెంకన్న, ప్రభు, మొరిశెట్టి యల్లేష్ పాల్గొన్నారు.

నూతన్‌కల్: మండలంలో గణేష్ మండపాల్లో అన్నదానం చేశారు.

సూర్యాపేట టౌన్: పట్టణంలోని ఎన్టీఆర్ నగర్‌లో ఏర్పాటు చేసిన వినాయకుడి మండపంలో నిర్వహించిన పూజల్లో మునిసిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ పాల్గొన్నారు. జిల్లా కేంద్రంలోని 19వార్డు కందుల శ్రీరామ్, సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు విద్యానగర్‌లోని 45వార్డులో నిర్వహించిన పూజల్లో కౌన్సిలర్ గండూరి పావనికృపాకర్ పాల్గొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు.



సూర్యాపేట టౌన్: జిల్లా కేంద్రంలోని అంజనాపురి కాలనీలో సమస్యలు పరిష్కరించాలని ఆ కాలనీ మహిళలు కోరారు. ఈ మేరకు బుధవారం జిల్లా కేంద్రంలోని మునిసిపల్ కార్యాలయంలో మునిసిపల్ కమిషనర్ బి.శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు మాట్లాడుతూ అంజనాపురి కాలనీలో సీసీ రోడ్లు, మురుగునీరు సాఫీగా వెళ్లడానికి కాల్వలు నిర్మించాలని, కుక్కల బెడదను అరికట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీ మహిళలు ఏకలక్ష్మి, ప్రేమకుమారి తదితరులు పాల్గొన్నారు.

సూర్యాపేట అర్బన్: కొట్లాడి సాధించుకున్న కార్మిక చట్టాలను నిర్వీర్యం చేసేలా కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేస్తోందని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నెమ్మాది వెంకటేశ్వర్లు, ఇఫ్టూ జిల్లా ప్రధాన కార్యదర్శి గంట నాగయ్య ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని వాణిజ్య భవన్ సెంటరులో భవన నిర్మాణ కార్మికులతో కలిసి 'కార్మిక సంక్షేమ బోర్డును కాపాడుదాం' అంటూ సంతకాలు సేకరించి మాట్లాడారు. భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు పథకాలను ప్రైవేటు బీమా కంపెనీలకు అప్పగించే ప్రయత్నాన్ని కార్మికులతో కలిసి అడ్డుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కుసుకుంట్ల సైదులు, వీరబోయిన లింగయ్య, నారాయణ, సైదులు పాల్గొన్నారు.

సూర్యాపేటఅర్బన్: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించాలని అభినవ చారిటబుల్ ట్రస్టు సభ్యుడు జవ్వాజి నాగేశ్వర్‌రావు అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్‌నగర్‌లో ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అభినవ చారిటబుల్ ఆధ్వర్యంలో ఉచితంగా స్కూల్ బ్యాగులు పంపిణీ చేసి మాట్లాడారు. దాతల చేయూతను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని చదువులో రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో రిటైర్డు ఉపాధ్యాయుడు నర్సింహారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

సూర్యాపేట: పాఠశాలల సమస్యల పరిష్కారానికి పాఠశాలల చైర్మన్లు కృషి చేయాలని ఎంఈవో ధారాసింగ్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాలల చైర్మన్లకు మండల స్థాయి శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో చైర్మన్లు ఉపేంద్ర, అరుణ, నాగమణి, ప్రమీల, జ్యోతి, సంధ్య, యమున, లక్ష్మీప్రసన్న పాల్గొన్నారు.

హుజూర్‌నగర్: సైబర్ నేరాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ ముత్తయ్య అన్నారు.పట్టణంలోని మైనార్టీ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఏఎస్ఐ రమేష్, ప్రిన్సిపాల్ రెహానాబేగం పాల్గొన్నారు.

హుజూర్‌నగర్, నేరేడుచర్ల: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు ప్రభుత్వం అందించే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని పోషణ అభియాన్ జిల్లా కోఆర్డినేటర్ రాజేష్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సోమమ్మ,యశోద, ఎన్.రాజ్యలక్ష్మి కోరారు. హుజూర్‌నగర్‌లోని గోవిందాపురం 1, 2 అంగన్‌వాడీ కేంద్రాల్లో, నరేడుచర్ల మునిసిపాలిటీ పరిధిలోని రామాపురం, మండలంలోని కల్లూరు అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించిన పోషణ అభియాన్ మాసోత్సవాల్లో మాట్లాడారు.

కోదాడ: ఇండోర్ సబ్‌స్టేషన్‌లో మరమ్మత్తుల కారణంగా హుజుర్‌నగర్ రోడ్డు, శ్రీమన్నారాయణ కాలనీ, ఎమ్మెస్‌నగర్‌లో గురువారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు పట్టణ ఏఈ మల్లెల శ్రీనివాసరావు తెలిపారు.

కోదాడ రూరల్: కోదాడ మాజీ జడ్పీటీసీ మండలపు కృష్ణకుమారి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. ఆమె మృతికి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తూమాటి వరప్రసాద్‌రెడ్డి సంతాపం తెలిపారు. సంతాపం తెలిపినవారిలో నంబూరి సూర్యం, అమరనాయిని వెంకటేశ్వరరావు, వెంకటాచారి, ఓరుగంటి శ్రీనివాస్‌రెడ్డి, ఇర్ల సీతారాంరెడ్డి పాల్గొన్నారు.

● అంచనాల కమిటీ చైర్మన్‌గా కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి నియామకంపై కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

నూతన్‌కల్: మండలంలోని తాళ్లసింగారం గ్రామానికి చెందిన మట్టపల్లి శంభయ్య కుమార్తె సౌజన్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. ఆ కుటుంబానికి గ్రామానికి చెందిన యాదవ కులస్థులు రూ.60వేలు ఆర్థికసాయం అందజేశారు. అనంతరం మృతురాలి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

తుంగతుర్తి: డ్రగ్స్, సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని సీఐ శ్రీనివాస్ కోరారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డ్రగ్స్, సైబర్ నేరాలపై విద్యార్థులకు పోలీస్ కళా బృందంతో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ భగవాన్, హెడ్‌కానిస్టేబుల్ సుధాకర్, ఇన్‌చార్జి హెచ్ఎం సహదేవ్ పాల్గొన్నారు.

తిరుమలగిరి: తిరుమలగిరిలో బస్‌డిపో ఏర్పాటు చేయాలని కోరుతూ డిపో సాధన సమితి ఆధ్వర్యంలో మునిసిపల్ కేంద్రంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో ఇన్‌చార్జి తహసీల్దార్ జాన్ మహ్మద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కడెం లింగయ్య, వేల్పుల లింగయ్య, పాష, నలుగూరి రమేష్, వీరయ్య, చిలుకల ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు

తిరుమలగిరి రూరల్: మండలంలోని కోక్యానాయక్‌తండా ఆవాసం దేవానాయక్‌తండాకు చెందిన కాంగ్రెస్ కార్యకర్త ఇస్లావత్ సంజీవ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. సంజీవ కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే మందుల సామేలు బుధవారం పరామర్శించి రూ.5వేలు ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎల్సోజు నరేష్, జుమ్మీలాల్, జనార్దన్, వీరేష్, రాజయ్య, లింగయ్య, సుధాకర్ పాల్గొన్నారు.